ప్రజా
# రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం

1

RNI No: APTEL/2023/87888

సోమవారం
18 ఆగస్టు 2025

## కేంద్ర మంత్రులతో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ

**దిల్లీ, ఆగస్టు 18, (రిపబ్లిక్ న్యూస్):** హస్తిన పర్యటనలో ఉన్న ఏపీ మంత్రి నారా లోకేశ్.. పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. జైశంకర్, జేపీ నడ్డా, హర్దీప్ సింగ్ పురీ, నితిన్ గడ్కరీతో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్లో డేటా సిటీ ఏర్పాటుకు సహకారం అందించాలని జైశంకర్ను కోరారు.



ఇటీవల ఏపీ బృందం సింగపూర్ పర్యటన వివరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం సింగపూర్ ప్రభుత్వంతో జరిపిన చర్చల గురించి కేంద్ర మంత్రికి నారా లోకేశ్ వివరించారు. జేపీ నడ్డాతో సమావేశమైన రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 నాటికి సమస్యను పరిష్కరిస్తామని ఆయనకు నడ్డా హామీ ఇచ్చారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీని కూడా మంత్రి లోకేశ్ కలిశారు. బీపీసీఎల్ రిఫైనరీ త్వరితగతిన నిర్మించేందుకు సహకారం అందించాలని కోరారు. ఓఎన్జీసీకి చెందిన జాక్ అఫ్ రిగ్ కాంట్రాక్టు సాధనకు సహకరించాలని కోరారు. ఏపీలో దీపం-2 పథకానికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్గడ్కరీతో లోకేశ్ సమావేశమై కానూరు-మచిలీపట్నం రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు-మచిలీపట్నం మధ్య ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని లోకేశ్ కోరారు.

## తాడిపత్రిలో ఉద్రిక్తత.. భారీగా మోహరించిన పోలీసులు

**తాడిపత్రి, ఆగస్టు 18, (రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎర్రగుంటపల్లి ఫ్లైఓవర్ వద్ద మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి.. శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహానికి క్షీరాభిషేకం చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మరోవైపు ఇదే సమయంలో హైకోర్టు అనుమతితో తాడిపత్రికి వచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి సిద్ధమయ్యారు. అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లును కలిసి పోలీసుల భద్రతతో తాడిపత్రికి బయలుదేరారు. హైకోర్టు ఆదేశాలతో ఆయనకు పోలీసులు భద్రత కల్పించారు. ఇరునేతల పర్యటనల నేపథ్యంలో తాడిపత్రిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో అప్రమత్తమైన పోలీసులు 750 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దారెడ్డిని అడ్డుకోవడానికి పెద్దఎత్తున తెదేపా కార్యకర్తలు ఎదురువెళ్లారు. పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి వద్ద ఆయన్ను అడ్డుకున్నారు.



## శ్రీశైలం ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద.. 5 గేట్ల ద్వారా నీరు విడుదల

**సున్నిపెంట, ఆగస్టు 18, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. దీంతో మరో రెండు గేట్లు ఎత్తారు. మొత్తం ఐదు గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్టుకు 2,30,876 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. ఔట్ ఫ్లో 2,29,129 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,784 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఐదు గేట్ల ద్వారా 1,33,030 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.80 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 197.91 టీఎంసీలుగా కొనసాగుతోంది.

## బీసీ రిజర్వేషన్లు.. గత ప్రభుత్వం చేసిన చట్టమే మనకు అడ్డంకి: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 18, (రిపబ్లిక్ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ట్యాంక్బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాస్పూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. 66 గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్గాంధీ ప్రాణాలర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియాగాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గతంలో రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమే. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో కులగణన సర్వే చేశాం. అందులో తప్పులుంటే చూపాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణను తప్పుపట్టవద్దు. దీన్ని తప్పుపడితే వందేళ్ల వరకు బహుజనులకు న్యాయం జరగదు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఐదు నెలలుగా కేంద్రం పెండింగ్లో పెట్టింది. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ కలిపితే 70 శాతం వరకు చేరుతాయి. తెలంగాణలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం చట్టం చేసింది. గత ప్రభుత్వం చేసిన చట్టం మనకు అడ్డంకిగా మారింది." అని రేవంత్రెడ్డి అన్నారు.



## స్త్రీ శక్తిని రాష్ట్రమంతా అమలు చేస్తున్నందుకు జగన్కు కడుపు మంట: మంత్రి సంధ్యారాణి

**అమరావతి, ఆగస్టు 18, (రిపబ్లిక్ న్యూస్):** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై వైకాపా విమర్శలు చేయడం అర్థరహితమని మంత్రి సంధ్యారాణి అన్నారు.

అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అసహనంతోనే వైకాపా నేతలు మాట్లాడుతున్నట్లు ప్రజలంతా గమనించారన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిపై కోర్టుకు వెళ్లిన జగన్ తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారని విమర్శించారు. "తల్లి, చెల్లిపై కోర్టుకెళ్లిన వ్యక్తి కూడా మనపై మాట్లాడతారా? సీఎంగా పని చేసిన వ్యక్తి.. జాతీయ జెండా కూడా ఎగురవేయలేని స్థితిలో ఉన్నారా? భరతమాత అంటే జగన్కు గౌరవం లేదు. జిల్లాకే పరిమితం చేద్దామనుకున్న 'స్త్రీ శక్తి'ని రాష్ట్రమంతటా అమలు చేస్తున్నందుకు జగన్కు కడుపు మంటగా ఉంది. స్త్రీశక్తి, తల్లికి వందనం పథకాల ద్వారా మహిళలంతా పండుగ చేసుకుంటుంటే జగన్ మాత్రం కడుపు మంటతో రగిలిపోతున్నారు. బాలికల నుంచి వృద్ధుల వరకూ ఏ మహిళకు 'స్త్రీ శక్తి' అందడంలేదో జగన్ సమాధానం చెప్పాలి. ప్రజల మీద అక్కసు ఇలానే కొనసాగితే ఉన్న 11కూడా ఈసారి మిగలవు. మాజీ మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిది. మహిళల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న చంద్రబాబును విమర్శించే హక్కు ఎవరికీ లేదు" అని సంధ్యారాణి అన్నారు.



## కూకట్పల్లిలో 12 ఏళ్ల బాలిక హత్య

**కూకట్పల్లి, ఆగస్టు 18, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని కూకట్పల్లి సంగీతనగర్లో 12 ఏళ్ల బాలిక హత్యకు గురైంది. తల్లిదండ్రులు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. వారు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను దుండగులు హతమార్చారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తండ్రి.. కుమార్తె మృతిచెందిన విషయాన్ని గుర్తించారు. దీనిపై వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటనాస్థలికి చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్టీమ్ ఆధారాలను సేకరిస్తున్నారు.



## రిపబ్లిక్ సినిమా

## సూర్య సినిమాలో బాలీవుడ్ నటుడు.. క్లారిటీ ఇచ్చిన దర్శకుడు



కోలీవుడ్ అగ్ర కథానాయకుడు సూర్య ప్రస్తుతం మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆయన ఓ సినిమాలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ నటించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వీటిపై దర్శకుడు స్పందించారు. ఆయన ఇందులో నటించడం లేదని స్పష్టంచేశారు. 45 ఏళ్ల క్రితం అనిల్కపూర్ తెలుగులో 'వంశవృక్షం' అనే చిత్రంలో నటించారు. దీనితర్వాత ఆయన సూర్య సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారంటూ రూమర్స్ వైరలయ్యాయి. వీటిని దర్శకుడు ఖండించారు. "మేము అనిల్కపూర్ను కలవలేదు. కనీసం ఫోన్ లో కూడా మాట్లాడలేదు. కానీ, ఈ రూమర్స్ ఎలా పుట్టుకొచ్చాయో మాకు తెలియడం లేదు. ఇలాంటి వార్తలు నమ్మకండి. అధికారిక సమాచారాన్ని మాత్రమే షేర్ చేయండి" అని వెల్లడించారు. సూర్య చాలా ప్రతిభావంతుడని ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉందని వెంకీ తెలిపారు. ఇక ధనుష్తో 'సార్', దుల్కర్ సల్మాన్తో 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాల తర్వాత వెంకీ దర్శకత్వంలో రానున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సూర్య 46వ సినిమాగా ఇది రానుంది. మమితాబైజు కథానాయిక. రవీనాటాండన్, రాధిక శరత్కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఇది రూపొందుతోంది. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

## రిపబ్లిక్ స్పోర్ట్స్

## దులీప్ ట్రోఫీ నుంచి ఇషాన్ కిషన్ ఔట్.. ఆసియా కప్ సెలక్షన్కు డౌటే?



భారత క్రికెట్ జట్టులోకి రావాలంటే తీవ్ర పోటీ నెలకొంది. ఫామ్తో పాటు ఫిట్నెస్ను కాపాడుకోవడం అత్యంత కీలకం. మరికొన్ని రోజుల్లో దేశవాళీలో దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. వచ్చే నెలలో ఆసియా కప్ జరగనుంది. ఈ సమయంలో గాయాల బెడదతో ఆటకు దూరమైతే జట్టులోకి రావడం చాలా కష్టం అవుతుంది. ఇప్పుడీ పరిస్థితి టీమ్ ఇండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్కు ఎదురైంది. దులీప్ ట్రోఫీ బరిలోకి దిగదామనుకున్న ఇషాన్ గాయం కారణంగా వైదొలిగాడు. ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఈ విషయాన్ని ఖరారు చేసింది. అతడి స్థానంలో ఆశిర్వాద్ స్వైయిన్ను తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇషాన్ నాయకత్వంలోనే ఈస్ట్జోన్కు ఆడాల్సిఉంది. ఇప్పుడు అతడి గైర్హాజరీలో వైస్ కెప్టెన్గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్ నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. అయితే, ఇషాన్ గాయం పరిస్థితిపై మాత్రం ఒడిశా బోర్డు తన ప్రకటనలో వెల్లడించలేదు.

### వస్తాడనుకుంటే.. ఇప్పుడిలా

ఆసియా కప్ కోసం జట్టును ప్రకటించేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ సిద్ధమైంది. రిషభ్పంత్ గాయం కారణంగా ఆడటంపై ఇంకా స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో సంజుశాంసన్, ఇషాన్ కిషన్, జితేశ్ శర్మ మాత్రమే వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ స్థానం రేసులో నిలిచారు. ఎడమచేతివాటం బ్యాటర్ కావడం ఇషాన్కు కలిసొచ్చే అంశమే. కానీ, ఇప్పుడు గాయపడటంతో ఆసియా కప్లో ఇషాన్ ఆడటం దాదాపు కష్టమేనన్న అభిప్రాయం క్రికెట్ విశ్లేషకుల్లో నెలకొంది.

### చివరిగా ఎప్పుడు ఆడాడంటే..

గతేడాది ప్రపంచకప్ ముందువరకూ బీసీసీఐతో పొసగకపోవడంతో చాన్నాళ్ళు దేశవాళీతోపాటు అంతర్జాతీయ క్రికెటూ దూరమయ్యాడు. చివరిసారిగా 2023లో జాతీయజట్టుకు ఆడాడు. దీంతో కౌంటీ క్రికెట్లో ఆడి తన ఫామ్ను అందిపుచ్చుకున్నాడు. 2025 ఐపీఎల్లోనూ సన్రైజర్స్ హైదరాబాద్కు ప్రాతినిధ్యం వహించి సెంచరీ బాదాడు. ఆ తర్వాత బీసీసీఐతో సయోధ్య కుదిరి మళ్లీ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. దీంతో జాతీయజట్టులోకి వచ్చేందుకు మళ్లీ దేశవాళీ క్రికెట్లో కి అడుగుపెట్టాడు. ఇప్పుడు గాయంతో ట్రోఫీకే దూరం కావడం అతడి భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

## అందం

వేపతో ఎన్నో లాభాలున్నాయి. దీనిని రాస్తే చాలా సమస్యలు దూరమవుతాయి. అందులో ఒకటి జుట్టు రాలడం కూడా తగ్గడం. దీనికోసం వేప నూనెని ఎలా తయారు చేయాలి, ఎలా వాడాలి, ఇదెలా పనిచేస్తుందో తెలుసుకోండి.



వేపలో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది చర్మ, జుట్టు సమస్యల్ని దూరం చేస్తుంది. వేపలో యాంటీ సెప్టిక్, యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. దీనిని బ్యూటీ రొటీన్లో చేర్చడం వల్ల అందానికి సంబంధించిన చాలా సమస్యలు దూరమవుతాయి. దీనిని జుట్టు, చర్మ సమస్యల్ని దూరం చేసేందుకు వాడుకోవచ్చు. దీనిలోని అద్భుత గుణాలు జుట్టు, చర్మానికి మేలు చేస్తాయి.



## జుట్టుకి సంబంధించిన అన్నీ సమస్యల్ని దూరం చేసే వేపనూనె, ఇంట్లోనే తయారు చేయండమెలా



### ఎలా తయారు చేయాలి



- వేప నూనెని కూడా ఇంట్లోనే తయారు చేయొచ్చు. దీనికోసం
- తాజా వేపాకుల్ని తీసుకోవాలి.
- వీటన్నింటిని శుభ్రంగా క్లీన్ చేయాలి. తర్వాతి వీటన్నింటిని గ్రైండ్ చేసి పేస్టులా చేయాలి.
- ఇప్పుడు ఈ పేస్టుని కొబ్బరి లేదా ఆలివ్ ఆయిల్లో కలపండి.
- ఇప్పుడు కలిపిన మిశ్రమాన్ని డబుల్ బాయిల్ మెథడ్లో వేడి చేయండి.
- వేడి చేసిన నూనె రంగు మారుతుంది. అప్పుడు మంటని తగ్గించండి.
- ఇప్పుడు తయారైన నూనెని పల్చని గుడ్డ లేదా ఫిల్టర్లో వేసి ఫిల్టర్ చేయండి.
- అందులోనుంచి వచ్చిన నూనెని గాజు సీసాలో స్టోర్ చేయండి.

### ఎలా వాడాలి



ఇలా తయారైన వేపనూనెని వారానికి రెండు సార్లు మీ స్కాల్ప్, హెయిర్కి మసాజ్ చేయండి. దీంతో జుట్టు సమస్యలు ఏవైనా కూడా దూరమై జుట్టు చక్కగా పెరుగుతుంది. జుట్టుకి నూనెని రాసి మెల్లిగా మసాజ్ చేయాలి. దీంతో స్కాల్ప్పై రక్త ప్రసరణ కూడా పెరుగుతుంది.

### ఎప్పుడు క్లీన్ చేయాలి



తలకి ఈ నూనె రాసిన తర్వాత గంటసేపు అలానే ఉంచాలి. లేదంటే, ఇబ్బంది లేదనుకుంటే రాత్రంతా కూడా ఉంచొచ్చు. కానీ, కొద్దిగా చేదుగా వాసన వస్తుంది. కాబట్టి, గంటసేపు అలానే ఉంచి ఆ తర్వాత మైల్డ్ షాంపూతో షాంపూ చేసుకోవాలి.

### ఇంకెన్ని విధాలుగా వాడొచ్చు



ఇప్పుడు ఈ నూనెని హెయిర్ కేర్ రొటీన్లో రకరకాలుగా వాడొచ్చు. దీనికోసం ఆయిల్ని తీసుకుని మీ షాంపూలో కూడా కలిపి షాంపూ చేయొచ్చు. దీంతో కుదుళ్లు, జుట్టుకి బాగా రాయండి.

**కండీషనింగ్**

ఈ నీమ్ ఆయిల్ని కండీషనర్లో కలిపి జుట్టుకి అప్లై చేసి కాసేపు ఉంచి ఆ తర్వాత షాంపూ చేయొచ్చు. దీంతో తలలో ఇరిటేషన్ తగ్గుతుంది. స్కాల్ప్ కూడా హెల్దీగా ఉంటుంది.

### లాభాలు



ఈ నూనెని హెయిర్కేర్ రొటీన్లో యాడ్ చేసి మసాజ్ చేయడం వల్ల హెల్దీ సెల్స్ పెరుగుతాయి. బ్లడ్ సర్క్యులేషన్ పెరుగుతుంది. దీంతో హెయిర్ఫోలికల్స్ బలంగా మారి జుట్టు పొడుగ్గా పెరుగుతుంది. దీంతో జుట్టు పల్చబడదు. ఊడిపోదు, పొల్యూషన్, స్ట్రెస్, మెడికేషన్ వల్ల జుట్టు రాలే సమస్యలుంటే అవి కూడా తగ్గిపోతాయి. ఈ నూనెలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బయాటిక్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు బట్టతలని తగ్గిస్తాయి. దీంతో పాటు సోరియాసిస్ని దూరం చేస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గించి జుట్టు బలంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.

**చుండ్రు**

చుండ్రుతో బాధపడేవారికి ఈ నూనె వరమని చెప్పొచ్చు. దీనిని రాయడం వల్ల జుట్టు డ్రైగా మారదు. ఇందులోని యాంటీ ఫంగల్ గుణాలు డాండ్రఫ్ని తగ్గిస్తుంది.

**పేలు**

వేప నూనె రాయడం వల్ల పేల సమస్య తగ్గుతుంది.

దీంతోపాటు జుట్టు బ్రేకేజ్ అవ్వడం వంటి సమస్యల్ని తగ్గించి జుట్టు బలంగా మారేలా చేస్తుంది. ఇందులోని అద్భుత గుణాలు జుట్టుని మాయిశ్చరైజ్ అయ్యేలా చేస్తాయి. దీంతో జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.

**తెల్ల వెంట్రుకలు**

ఈ నూనె రాయడం వల్ల జుట్టు తెల్లబడకుండా ఉంటుంది. రెగ్యులర్గా రాస్తే కచ్చితంగా జుట్టు తెల్లబడడం కాస్తా కంట్రోల్ అవుతుంది.

### సైడ్ ఎఫెక్ట్స్

ఇన్ని లాభాలున్న వేప నూనె జుట్టుపై కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్స్ని కూడా చూపిస్తుంది. మరీ సున్నితంగా ఉండే తలపై ఈ వేపనూనె రాస్తే మంట, చికాకు వంటి సమస్యలొస్తాయి. కాబట్టి, ఈ నూనెని రాసే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది.

**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.